# సముద్ర మథనం

శ్రీ హనుమచ్ఛాస్త్రి

౧

వేసంగి సెలవులు—వెన్నెల రాత్రులు—కాల్చే ఒంటరితనం—బలే తమాషాగా వుందిగదూ !

రోడ్డు కవతల దూరంనుంచి— సన్నని స్త్రీకంఠం నొక్కులహొయితో 'జయంత శ్రీ' లేతగాలి కెరటాలమీద తేలి విన పడుతోంది జాజిపూలమత్తుసువాసనలాగు.

పెరట్లో చిలకలు అంటుమామిడి మొక్కల దోరబంట్లను ప్రియురాలి మెత్తని పెదవుల్లాగు నొక్కుతున్నాయి.

అభాగ్యుని తలలోని అనంత వాంఛల్లాగు ఆకాశంనిండా నక్షత్రాలు—

పరమశివుడు ఉద్ధతానంద నాట్యంలో ఒకనాడు పకాలున నవ్విన ధవళాట్టహాసం ప్రపంచమంతా కమ్మి కరిగికరిగి చివరకు ఈ వైశాఖమాసపు వెన్నెలరాత్రిగా నిలిచిపోయిందేమో అనిపిస్తుంది.

ఎంత వుత్సాహాన్ని— ఉద్రేకాన్ని పురిగొల్పే రాత్రి ఇది!

ఇన్నాళ్లూ, సిరాబుడ్లల్లో—చిత్తు కాగితాల్లో— నలిగి చావగా మిగిలిన ఏదో నా అంతస్సుందరచైతన్యం-ప్రచండకాంక్షలు—మేలుకుని నాచుట్టూ తిరుగుతున్నాయి.

"మురళి పాటకు రగిలి మరుగు నీ వెన్నెలలు, సొగయు నామెద కేల తగని సౌఖ్యజ్వాల" సరిగ్గా అట్లాగే వుంది నా అవస్థ—

మరణించానో — ఊపిరివిడుస్తున్నానో నిద్రించానో-మేలుకున్నానో నాకు జ్ఞాపకం లేదు.

నా మెదడు ఘూర్ణిల్లి తన సంకుచితపు హద్దులను కొట్టుకొని విస్తరించి ఒక కాంతిమయ దేవభూమిగా మారిపోయింది.

ఒచ్చింది—

ఒక జగన్మంగళమూర్తి—లావణ్య పరమావధి—

వెండి శెమ్మామీద నుంచి రకరకాల భంగిమలతో సాగే సుగంధనిర్మలధూమ రేఖలాగు నామెదుట కదలుతూ "లోకమంతా అలసి చల్లని వెన్నెల ఒడిలో విశ్రమిస్తూ ఉండగా—నీ ఉన్మిషన్నేత్రాలకు కనుమోడుపే కరువయిందా నాయనా" అంది.

ఉలిక్కిపడి కళ్లుతెరచి చూశాను.

ఓహో!! ఎవరీ మహోజ్జ్వలమూర్తి? వేజోక నునుమంచు తెరలమీద అలక్త కారుణ మృదుపదలాస్యంతో దర్శన మిచ్చే ఉషస్సుందరిలాగు వెలుగుతోంది.

తలనిండా కోటిపూలు ... అవి నందన నవనీత పారిజాతకుసుమాలో — చైత్రరథ ప్రఫుల్ల హరిచందన పుష్పాలో— మానస సరస్సమాసీత స్వర్ణకమలాలో — కాని,

ప్రాంతభూమినీ-నన్నూ- ఆమెనూ అపూర్వ పరిమళంలో ముంచెత్తుతున్నాయి. చూర్ణ కుంతలాల్లో రంగురంగుల గడ్డిపూలను తురుముకుంది.

సృష్టిలోని అంత చిన్న అందపు కదలిక నుగూడా విడువలేక శిరసావహించే ఆ అందాల రాణి యెవరో?

ఆ దివ్య దర్శనంతో నా కళ్లకు క్రొత్త ప్రాణం ఒచ్చింది. నామాటల్లో వింత తీపి కలిసింది—మహోత్సాహంతో అన్నాను. అమ్మా, ఎవరు నువ్వు?

కాళిదాస మహాకవి సుందరభావనా జగత్తునకూ — అసాధారణ స్వప్న సీమలకూ రాని విశిష్ట కావ్య కల్యాణివా?

అమరావతీ జగదేకశిల్పి ఊహలకూ—ఉలికీ- దొరకని శిల్పసీమంతినివా?

రామారావు మెత్తని కుంచెలకైనా తగలక వింత వన్నెల మెలకువతో విహరించే దుర్లభ చిత్రరేఖవా?

సైగాల్ అమృత కంఠనాళాల్లో సైతం ఒదగలేక మలయమారుత భంగాల్లో ఎగసి వచ్చిన అద్భుత సంగీత సంగతివా?

కళాతపస్వి నిశ్చల ధ్యానముద్రలో తళుక్కున మెరిసే కళాదేవివా?

నవ్వింది—

"ఎందుకమ్మా, దురదృష్ట నేత్రాలకీ అమరజ్యోతి?

నన్ను నిరాశలో కుమిలి పోనీ— నా ఎడారి జీవితం హఠాత్తుగా నీ అనుగ్రహ జ్యోత్స్నాశాంతిని ఎట్లా భరించగలదు?"

దైన్యంలో నాకంఠం రుద్ధమైపోయింది.

కన్నులు చెమ్మగిల్లగా ఆమె జాలిగా నవ్వి చందనలతా శిశిరమైన తన చేతితో నా తల నిమురుతూ అంది.

"ఎందు కట్లా నీరస నిరాశలో కుంగి పోతావు—అసాధారణంగా నీ కిచ్చిన హృదయాన్ని అర్థం చేసుకో- ఇంకా నీ తపన పూర్తి కాలేదు. యోగసిద్ధి పూర్తి కానిదే అల్పయోగపరిచయంవల్ల గారిడీపనులు చేసి లోకంమెప్పులకు లొంగే యోగపతితుడులాగు సత్కళాసిద్ధి కలుగకమునుపే అక్షరగమ్యతకు అలరి తెలివితక్కువవాళ్లంతా 'కవిశిరోభూషణా' అంటే నిజమే అనుకుని మోసపోయావు—లోకం అవివేకశీలాన్ని ఇప్పుడు గ్రహించి దిగులుపడుతున్నావు. లే—ప్రకృతికావ్యాన్ని తరచు. ఈ సీతాకోకచిలకలు — పసివాళ్ల పాలనవ్వులు—కలువకన్నుల కన్యలు- మేఘాలు—మెరపులు— కన్నీళ్లు — ప్రణయాలు — విరహాలు— అదిగో ఒకొక దానివెనుక— ఎన్ని వినపడని సందేశాలు — కనపడని అందాలు—ఎన్ని చిత్ర సన్నివేశాలు!

కన్ను తెరువు—క్షుద్ర హృదయ దౌర్బల్యాన్ని దూరం చెయ్యి-"

ఆమాటలతో నాలో ఉత్సాహం జ్వలించడానికి బదులుగా ఉద్రేకం రగిలి అన్నాను.

"అమ్మా, చాలు- కొత్త ఆశలు కల్పించి కొత్త అశాంతుల్లో నన్ను తొయ్యకు —చుట్టూ తిరిగే నలుగురు జడుల్లాగు దొరికిన సేనాధికారంతో—పాత రాగిచెంబునీతితో— కోతిభార్యతో గర్విస్తూ 'తగు

మనిషి' గా తిరగనివ్వక బ్రదుకంతటినీ తరిమి కాల్చే ఈ సౌందర్య జ్ఞానా న్నిచ్చి ఎందుకు తీరని అపకారం చేశావు ?

కారడవికి శరచ్చంద్రికలాగు— కంటక వృక్షానికి అడవిమల్లెతీగెలాగు – హృదయం లేని దున్నపోతుకు ఊర్వశి నిచ్చి, రసికత్వం చమత్కారం లేని కొయ్యబొమ్మను ప్రేమించమని నా కిచ్చావుగదూ—

మృదులమానవహృదయాలను నిష్కరుణంగా కత్తిమొనతో కెలికి చిత్రవధ చేసే వైద్యుణ్ణి- చెయ్యకపోయావు ?

నిజం అబద్ధంగానూ, అబద్ధం నిజంగానూ మార్చడమే జీవనవృత్తిగా గల 'న్యాయవాది' గా పుట్టించకపోయావూ ?

తన మిడిమిడిజ్ఞానాన్ని విజ్ఞానసర్వస్వంగా చూపి కుర్రకుంకలదగ్గిర సర్వజ్ఞుడుగా మాట్లాడే ఉపాధ్యాయుణ్ణిగా సృష్టించితే ఎంత బాగుండిపోను ?

దేశసేవ అని చెప్పుకుని దాని చాటున తన తుచ్ఛస్వార్థాలను- కక్కుర్తులను తీర్చుకుంటూ మర్యాదగా తిరిగే 'స్వదేశభక్తుణ్ణి'గానైనా చెయ్యకపోయావూ ?

తియ్యని ప్రతి గానలేశానికీ—చక్కని ప్రతిచిత్రరేఖకూ— కమ్మని ప్రతి కావ్యాంశానికీ పరవశంగా చలించే సున్నితమైన మనస్సు నిచ్చి ఆరనివేదనను అనుగ్రహించావుగదూ—

ఆకాశపు నీలంలో రంగురెక్కలు ఊపుతూ పావురాలు పరుగెత్తితే నాకేం ?

మార్గశిర ప్రభాత వృక్షాగ్రాల లేత ఎర్రని చివుళ్లమీద మంచుబొట్లు ఉదయారుణకాంతిలో మెరిస్తే నా కెందుకూ ?

సమాజం ఇనపకాలికింద నలిగే పడుచు వితంతువు నీటిమేఘపు కళ్లలోనుంచి దుఃఖం కురిస్తే నాగుండె కొట్టుకోవడం ఎందుకూ ?

దేశం నిస్సారమై— జాతి నిర్వీర్యమై మనుష్యులు నడిచే పీనుగులై నిశ్చింతగా తిరుగుతూంటే, దురభిమానంతో నేను తల్లడిల్లడం ఎందుకూ ?

అమ్మా, ప్రపంచాన్ని చూసినకొద్దీ- ఏదో ఎలుగెత్తి చెప్పవలె ననీ— ఏదో పాడవలె ననీ- ఏదోరచించాలనీ- నిరంతర ప్రసవవేదనతో నా మస్తిష్కం బద్దలవుతూంది.

పడుచుపిల్లల విఫలప్రేమ రాల్చే వెచ్చని కన్నీళ్లలోని అగాధ సందేశాన్ని – క్షుత్పీడిత నిర్భాగ్యభిక్షుకుని యాఞ్చాదైన్యంలోని అగ్నిజ్వాల చురుకునూ— లోకానికి వ్యభిచారమై, తనకు పవిత్రరతిఫలమై, దొరికిన పసిపాపను వక్షాని కదుముకునే పతితురాలి మాతృహృదయపు గిలగిలనూ—అందని సుందరభావనాలోకంలోని అద్భుతానుభవాలను తనరచనలో సంపూర్ణంగా ముద్రించాలని తన్నుకునే కవికుమారుని భావబాధనూ- ఏభాషలో చెప్పగలను ? ఏ మాటలు వివరించగలవు ? ఏఛందస్సు పాడగలదు ?

నాచచ్చుభాషా— నీరసవాక్కూ ఏం చెయ్యగలవు?" వెక్కి వెక్కి ఏడ్చాను.

దీనత్వాన్ని—దౌర్బల్యాన్ని దహించే విజ్ఞానజ్యోతులవంటి కళ్లతో నావైపు ఒకసారి తేరిచూసి నిశ్చల నిశ్చయంతో ఆమె పలికింది —

"అన్నా, నాకు తెలుసు— ఈ హృదయ దుర్బలత్వంతోనే నువ్వు మూఢుడ వవుతున్నావు—

విశ్వకోశాన్ని చూస్తున్నావు— కాని పుటలు తిప్పితిప్పి పుస్తకం అర్థం కాక విసిగి విసిగి మూసివేసిన వ్యర్థుడి వయావు— అంత రార్థం గ్రహించడానికి ప్రయత్నించ లేదు. ఇంక నీ కంటికి వెలుగు కలిగే దెట్లా ?

నీ యాత్రలో అందబోయే ప్రతి అనుకూల్యాన్నీ—సంతృప్తినీ— నీచేతికి దొరకకుండా చేతులారా నేనే లాగివేశాను.

నీకే ఊర్వశిని ప్రేయసిగా— అఖిల తృప్తినీ కరతలామలకంగా— చేస్తే నీకు వేదనామాధుర్యం బోధపడే దెట్లా ?

వీణతీగలవంటి నీసుకుమారహృదయం, లెక్కలేని సంఘర్షణలనూ— ఘాతాలనూ తినకపోతే యుగయుగాల్లో ప్రతిధ్వనించే కావ్యగానం లోకాని కెట్లా లభిస్తుంది ?

అప్సరసౌందర్యం నీ గుమ్మం లో వ్రేలాడదీస్తే సుదూర అంతరాంతర సౌందర్య రహస్యాలకోసం తహతహతో వెదకే దెవరు ?

ప్రపంచయాత్రాఖిన్నులనూ — సంసారదుఃఖితులనూ — స్వాదువాక్సరితోషం లో తేర్చడానికి నిన్ను వరప్రసాదంగా అర్పించాను.

ఎండలలో మాడి తనమధుర ఫలాలను ప్రజలకు దానంచేసే రసాలశాఖివి—

తన స్వచ్ఛ సుగంధిలపుష్పాలను విలాసినీ కబరీభరాల్లో అలంకరించి మిగిలిన మల్లికావల్లికవు—

నిగూఢమైన అంతశ్శక్తినీ — అనంత ప్రయోజనాన్నీ మరచి విచారించకు—

నిజమైన కళాతపోగ్నిలో తపించు— నీకంటికి తపనీయ దుర్నిరీక్ష్యతేజస్సువస్తుంది. దానితో స్థూలరూపప్రతిబంధకాలను దూసుకునిపోయిసత్యశివసుందరసూక్ష్మరూపాన్ని దర్శించగలుగుతావు— అప్పుడు ఈ ప్రపంచపు నీతులూ—ధర్మాలూ— సూత్రాలూ— నీకంటికి పరమాణువులు —

కళాసిద్ధుడవు కాక — రంగుకాగితపు ముక్కల్లాంటి మూలమూలల మాటలను పోగుచేసి— పిచ్చితలల సమాసాలకు పెనగులాడి— బుద్ధిహీనుల చప్పట్లకూ— వెర్రిపూల దండలకూ—బిరుదాలకూ — తల ఒగ్గితివా భ్రష్టుడవై పోతావు- జాగ్రత్త!

రససిద్ధుడవై ఒక్క సహృదయుని మనస్సు ద్రవించే రచన చేసితివా ధన్యుడవు— వెళ్లిపోయింది —

౨

వెంటనే ఇంకోవ్యక్తి నా ఎదుట ప్రత్యక్షం— సన్నని వెన్నెలపొరను స్తనవల్కలంగా—పరిధానంగా—చుట్టుకొని హిమవత్పర్వత శ్వేతసానువులపై విహరించే నగ్న దేవకన్యకలా వుంది.

"స్ఫురన్మూర్తీ! నీ వెవ్వరు ?" అని అడిగాను. పక్కున నవ్వింది—

శరద్రాత్రి గోదావరి ఒడ్డున లక్షలు కెలువుపాదలు వికసించిన ట్లయింది.

తలను వింతబయ్యారంతో ఎత్తి కనుగొనల్లోంచి ప్రౌఢంగా చూస్తూ అంది —

"నాకోసం ఏడ్చి కలలు కన్నా నన్నావు— బతుకంతా నీకే అంకితమన్నావు— నన్నే గుర్తించలేకుండా వున్నావా?"

ఆమాట కశాఘాతంలా తగిలింది. ఎంత తియ్యని ఉపాలంభనం!

"ఏమిటీ—నిరంతరం నా జీవనశాంతిని ఒణికించే ప్రేమమూర్తివా? రా— ఇంకా దగ్గిరగా రా—నీ కర్పూర మసృణ శీతల బాహువులతో నాకంఠాన్ని ఊపిరాడకుండా నొక్కి వెయ్యి. నీ వినీలకుంతల కాలపాశంతో నా ప్రాణసారాన్ని లాక్కొనిపో. నీపరమ వంచకమోహినీనేత్రాలతో నన్నింకా ఎన్నాళ్లు పరిభ్రమింపజేస్తావు? నీ మృదుల పాదమంజీరధ్వనులకోసం ఎన్నిరాత్రులు గుండె నాపి ప్రతీక్షించగలను? స్త్రీహృదయం కృపాకోమలం అంటారే-నీ మనస్సుమాత్రం ఇనుపముక్కలతో కట్టారా?

ఏ శ్రావణ శుక్రవారపు సుప్రభాతంలోనో—చెట్టుసంపంగికొమ్మల చాటునుంచి, రాధామనోహరం తీగల వెనక నుంచి నేను చూడకుండా వచ్చి నాలో ప్రవేశించావు. నా మనోఽవకాశాన్నంతటినీ పరిమళించే అగరువత్తుల పొగలాగు ఆక్రమించావు. నాటినుంచి నన్నావేశించి పలికే పలుకులో-పాడే పాటలో—విషమనాట్యాన్ని — అపస్వరసంగీతాన్ని మోగించావు.

నేను చివరి ఊపిరి విడిచేటప్పుడైనా నీ అనలపరిరంభాన్ని అనుగ్రహిస్తావా?"
......అట్లాగే మాట్లాడివేస్తున్నాను.

మధ్యగా అందుకుంది—

"ఉన్మత్తభావశాలీ! ఉద్రేకంలో ఎందుకట్లా నాకు దూరంగా జరిగిపోతున్నావు — నీవంటి అగ్ని ప్రేమికుడికోసం— అఖాత ప్రణయమగ్నునికోసం— నే నెంత పరితపించి పరుగులెత్తుతానని— కాని చేతికి దొరికినదాన్నల్లా విసరికొట్టి— అందనివాటికోసం పడిచచ్చే మానవజాతికి చెందినవాడవన్న సంగతి మరచిపోలేను. నువ్వు నాకోసం తహతహపడి కృశించి ఆశాప్రతీక్షల్లో కాలి దురపిల్లకుండా నేను నీ కౌగిలింతలో వచ్చిపడితే నామీద నీకేం గౌరవంగా వుంటుంది?

అదీకాక— నీ ప్రచండ సౌందర్యదాహాన్ని చూస్తే నేను భయంతో కంపించిపోతాను.

ఎన్ని లావణ్యాలు—విలాసాలు— చక్కదనాలు ప్రపంచ మంతటా చూశావు — ఎక్కడనైనా ఆగి నీ మనస్సు సంతృప్తితో ఊరట చెందిందా? లేదు- నేతినేతి వాక్యాలతో ఋతువులు- లోకాలు- కాలాలు- దేశాలు, భూమి- ఆకాశం - అంతరాళం- అంతటా ఆరని తృష్ణతో భ్రమించే ఉద్రిక్త మధువ్రతుడవు- నీతో ఎవరు సుఖించగలరు? నిన్ను ఎవరు భరించగలరు?

నీ తీవ్రపరిభ్రమణంలోనుంచి ఒక్కసారి ఆగి నిదానంగా ముందు విరాట్ ప్రేమను బోధపరుచుకో—

క్షుద్రులను, బహిష్కృతులను, కురూపులను, విషణ్ణహృదయులను, విరోధులను, అజ్ఞానులను — దీనులను, కీటకాలను సైతం మనస్సారా నిష్కామంగా ప్రేమించడం నేర్చుకో.—

అప్పుడు నీఆత్మ ఎన్నిరెట్లు సంతుష్టిని- ఎంత ఔన్నత్యాన్ని.. అనుభవిస్తుందో

చూడు. నువ్వు నిరీక్షించ నక్కరలేదు- అప్పుడు నేనే నీకోసం వెతుక్కుంటూ వస్తాను.

నువ్వు అనుకోని త్రోవవెంట వచ్చి నిన్ను నా మెత్తని వక్షానికి అదుముకొని, పూలదారుల్లో నడిపించి నా గంధర్వసౌధానికి అతిథిని చేస్తాను. ఉత్తమసాధన చెయ్యి."

నిష్క్రమణ—

## 3

అనుపదంలోనే మరోవ్యక్తి—

క్షమాసత్యాలు కళ్లల్లోంచి ప్రవహించే 'పరిపాండుదుర్బలకపోల' జానకీదేవిలాగు వుంది.

లోకమాత ఉదారమాతృత్వం- విశుద్ధ సౌశీల్యం. పచ్చని ఆమె రూపధేయంలో స్పష్టంగా వెలుగుతున్నాయి.

ఆప్తులను చూచినప్పుడులాగు ఆమెను చూడగానే అనుభూతదుఃఖాలు ఉబికి పైకి రాబోతున్నాయి.

ఆపుకుని అన్నాను.

"శిథిలహృదయుల మలిన బాష్పాలు తుడిచి గుండెలో ఆదరించే కరుణాసుందరివా అమ్మా" అంతకంటె మాటలు లేవు.

శీతల మృణాలములవంటి చేతులను నావైపు చాపి అంది-

"పిచ్చితండ్రీ! ఇట్లా రా- నా ఒడిలో విశ్రమించు- లోకయాత్రలో ఎంత నలిగిపోయావు నాయనా—ఒకేఒక్కనాడు తన్మయ సుషుప్తిని ఎరగవుగదా......"

నా దీనముఖాన్ని చూచి ఓర్వలేక నన్ను దగ్గరగా తీసుకుని కౌగలించుకునే మాఅమ్మ జ్ఞాపకం వచ్చింది.

ఆమె నిర్వ్యాజ వాత్సల్యానికి వివశుడనై ఆమెవక్షంలో తల దూర్చి ఒకటే ఉష్ణాశ్రుధారను విడుస్తున్నాను.

కేతకీ గర్భపత్రంవంటి చేతితో నా ముఖాన్ని తుడుస్తూ ఆమె మాటాడుతోంది-

"లోపల వెయ్యిటన్నులమాలిన్యాన్ని దాచుకుని తీపిగా బుజంమీద చెయ్యివేసిన మిత్రుల ద్రోహంలో పడి లేవలేక బాధపడ్డావు—దొంగ అనురాగాన్నీ కృత్రిమ సౌజన్యాన్నీ నటించలేక అప్రయోజకుడవై తల ఒంచుకున్నావు.

లౌక్యం తెలియక నేటి సమాజంలో- సన్యాసుల్లో- మతోపన్యాసాల్లో- దైవభక్తిలో వున్న కుళ్లును స్వార్థాన్ని చూచి సహించలేక తోచిన నిజం మాటాడబోయిన 'మర్యాదస్తుల మంద'లో చోటు లేకుండా చేసుకున్నావు-

దబాయించి మాటాడేవాడిని విద్వాంసుడనీ- తడుముకోకుండా వాగేవాణ్ణల్లా ప్రవక్త అనీ, ప్రతికూతా పద్యంలో కుయ్యగలిగిన వాణ్ణల్లా మహాకవి అనీ భజించి వారి అవలేప ధిక్కారాలకు బలిఅయిపోయావు.

ఈ ప్రపంచంలో చేతగానివాడ ననీ- తిరస్కృతుడ ననీ- నిలవడానికి నీడలేనివాడ ననీ మనస్సంతా గాయం చేసుకుని కుంచుకుపోతున్నావుగదూ- బిడ్డా! తపించకు—

కార్చిచ్చువంటి నీ అంతరాత్మకు నేను శాంతిని కల్పిస్తాను. వాడిన నీ ముఖానికి నేను వికాసం ఇస్తాను.

ఒక్క రహస్యం విను-

'మొక్కినకొద్దీ కాలితో తొక్కే గుణం వుంది ఈ లోకానికి.' గర్వంతో- ఆధిక్యంతో నిన్ను తృణీకరించినవాణ్ణి ఎదిరించు-చీల్చు—

'సర్వథా వ్యవహర్తవ్యం కుతో హ్యవచనీయతా' అంతర్ధాన మయింది.

౪

కొన్ని నిమిషాలు నిశ్శబ్దం—

హఠాత్తుగా చిక్కని చీకట్లతో నా ప్రదేశ మంతా మునిగిపోతోంది. గుహల్లో నుంచి వెలువడ్డ క్రూరజంతువుల్లా గగనం నిండా కారుమేఘాలు మూగుతున్నాయి.

"మహిషపు లోహఘంటలు మబ్బు చాటున ఖణేల్‌మన్నాయి" అనేపాట ఎందుకో అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది.

త్రుటిలో — నిజంగానే రెండు బలిష్ఠ మహిషాలు లాగే భయంకరరథం ఒకటివచ్చి టక్కున నా యెదుట ఆగింది. నిలిచిన మహిషాల మాంసలకంధరాలు కదిలినప్పుడల్లా వాటిలోని ఉక్కుగంటలు భయపడ్డ పెద్దప్రాణాల్లాగు ఖంగున మ్రోగుతున్నాయి.

స్నేహానికీ—దయకూ—చిరునవ్వుకూ అతీతమైన భీకరమూర్తి ఒకడు దానినుంచి దిగాడు. సౌజన్యం ఎరగని అధికారి కుటిల శాసనం అతని నుదుటిమీద వేలాడుతోంది.

కారునల్లని జైనవిగ్రహం మాట్లాడుతూంది అమావాస్య రాత్రి దట్టమైన వెదురుటడవి గాలి పోసుకుని బీభత్సపుహోరు పెడుతున్నట్టు.

కెవ్వున కేకవేసి కళ్లు మూసుకున్నాను. హేళనగా నవ్వి అన్నాడు—

"పిరికివాడా, చిన్నఅవమానానికి — ఆశాభంగానికీ—ఆందోళనకూ తట్టుకోలేక మృత్యువును ప్రార్థించేవాడవుకదూ! రా— అట్లా అధైర్యంతో ముడుచుకుపోతా వెందుకూ?

ఈ దరిద్రప్రపంచంలో — నిర్భాగ్య మనుష్యజీవితంలో — ఏమి అనుభవించాలని నన్ను చూసి దిగులుపడి అట్లా వెనక్కుపోతావు—నామాట విను—నాతో రా—

కళ్లు తెరవకుండా వణుకుతూన్నగొంతులోనుంచే అన్నాను.

"అప్పుడే—ప్రాణాలకంటె తియ్యని నా ఆశలను—స్వప్నాలను తుడిచి తెరవెనక్కు లాక్కుపోవడానికి వచ్చిన మృత్యుస్వామివా ప్రభూ?"

"పిచ్చివాడా, కల్పించుకొన్న గాలిమేడల్లో దిగ్భ్రమ చెందుతున్నావు—ఇంతవరకు గడపిన నీ బ్రదుకులో ఏమి సంతుష్టి నీకు దక్కింది?

ఒక్కసౌందర్యలేశంకోసం- సజ్జనసానుభూతికోసం రెండుఎండుచేతులూ చాపి చాపి, గోరువెచ్చని కన్నీళ్లతో దోసిలి నింపుకున్నావు. కటికచీకటిలోకి ప్రదీపం తెచ్చిన అపరాధానికి ఉరిశిక్ష అనుభవించావు. నాకు తెలుసు - అంపకోతవంటి ఈ నిర్జీవయాత్రలో నీకు సుఖం లేదు. నీ ఊపిరాడినంతసేపూ నీ ఆశలు ఫలించవు. పాపం! నీ సమాధిమీద మాత్రం దీపాలు వెలిగి-పూలు పడతాయి.

నా రథంలోకి చూడు - ఎందరు - వీరులు - త్యాగులు - తీవ్రభావదగ్ధులు - ఉత్తమాశయ సంతప్తులు - నిరంతరాందోళనాక్లిష్టజీవులు - నీవంటి యువకులు-వ్యాధులు, బాధలు, ఆదర్శాలు, ఆవేశాలు, అన్నీ విడచి ఎంత నిర్విచారంగా ఉన్నారో చూడు ! నా సన్నిధిని నీకు తిరగని తరగని శీతల సుషుప్తిని ప్రసాదిస్తాను.

రా—ఆలోచించకు - రథం ఎక్కు - బంధువులు - మిత్రులు - కోరికలు - భవిష్యత్తులు ఏవీ నిన్ను బాధించవు - లే - తరువాత విచారిస్తావు"

డగ్గుత్తికతో ప్రాణోత్క్రమణ సమయంలో వలె తొట్రుపడే మాటలతో అన్నాను.

"వద్దు ప్రభూ - ఇంతలోనే నన్ను చంపెయ్యకు - రాను - అనుగ్రహించు—

నా గొంతులో తీపి చావనంతవరకూ కంఠం పగిలేలాగు పాడనీ — నాకళ్లు చూడగలిగినంతవరకూ ప్రతి సౌందర్యాన్నీ తిరిగి తిరిగి చూడనీ — నామెదడు పని చేసినంతవరకూ నాకు స్ఫురించే దిగంబర సత్యాన్ని చాటనీ —

క్షుద్రలోకంలోనుంచి వచ్చే ఏదూషణం - భూషణం - తిరస్కారం — పురస్కారం నన్ను తాకకుండా దుర్గమస్వేచ్ఛాపరిధులను నిర్మించుకుంటాను—నన్ను విడిచిపెట్టు "రాజాల నో ప్రభూ రాజాల నిపుడేను' ఈసుందరప్రపంచము విడువగాలేను"

కన్ను తెరిచాను.

ఏముంది ?

---

# ప్రకృతిపాట

శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి

ఇది యమృతగానవీచిక, ఈయనంత  
మైన ప్రకృతిగర్భాంతరాళాన మ్రోగు  
చున్నది; క్షణక్షణము కొత్తసొగసు కలదు-  
దాని వినగోరువారు బంధములు త్రెంచు  
కొని పరుగులిడి రండు; గగనపథముల,  
తోయదవిశాలశీతలచ్ఛాయల, అల  
తారకల వెల్గుచాలుల, మీరు కూడ  
రెక్కలం గట్టుకొని విహరింత్రుగాని—  
అచటి రంగులలో, గాలి యలలలో వి  
లీనులై రాగరసము క్రోలెదరుగాని—  
లెండు స్వేచ్ఛాపిపాస వర్ధిల్లువారు !